క్లుప్తంగా

హైకోర్టు తీర్పు హర్షణీయం

దొనకొండ: అమెరికన్ బాప్టిస్ట్ క్రిస్టియన్ మిషనరీ ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదని మద్రాస్ హైకోర్టు చెప్పిన తీర్పును స్వాగతిస్తున్నట్టు ఏబీఎం చర్చ్ సంఘ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. గత 35 సంవత్సరాలుగా సీఎస్ నెం.124/1994 కేసులో వాదోపవాదాలు విన్న మీదట పీఏబీసీ ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదని, ఎస్‌టీబీసీ, పీఏబీసీ, ఏబీఎఫ్ఎంఎస్ వారికి ఆస్తులు అమ్మే అధికారం లేదని మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించినట్లు చెప్పారు.

ఆలయాల్లో విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో వేనూతల కాటమరాజు స్వామి

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ శ్రీ వేనూతల కాటమరాజు స్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవత, ఎస్. కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు 86 మంది హాజరు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ఆదివారం కే రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ వారు నిర్వహించిన మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్‌కు 86 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల అడ్మిన్ నాని ఆదివారం తెలిపారు. విద్యార్థులకు పరీక్ష కేంద్ర వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేశారు. పరీక్ష సూపర్‌వైజర్‌లుగా ఆదిమూలపు ప్రభుదాసు, దేవదానం, విక్టోరియా, ప్రమీల, నాగరాజు, లూకరాజు వ్యవహరించారు. విజేతలకు 16వ తేదీ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే జైలుకే..

● సీఐ సుబ్బారావు హెచ్చరిక

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట ఇతరత్రా నిషేధిత ఆటల్లో పాల్గొన్నా, నిర్వహించినా వారిని జైలుకు పంపుతామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం ఆయన సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ పండుగల పేరుతో గ్రామాల్లో, పట్టణంలో వీటిని నిర్వహిస్తే ఇబ్బందులు పడతారన్నారు. సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కోడిపందేలు, పేకాట కోసం స్థలాలు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత జైలుకు వెళితే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పాసుపోర్టు, ఉద్యోగాలకు అడ్డంకిగా మారతాయన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలన్నారు.

ఆలయాన్ని సందర్శించిన శుద్ధ చైతన్యానంద స్వామి


పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఆలయ పూజారి, యక్కలి తదితరులు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం శుద్ధ చైతన్యానంద స్వామీజీ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణ వివరాలను, విశిష్టతలను, ప్రాంత ప్రాధాన్యాలను యక్కలి శేషగిరిరావు.. స్వామీజీకి వివరించారు. నేలమాళిగలోని శ్రీరంగ నాథునికి, వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీకి పట్టు వస్త్రాలను అందచేశారు. ఆలయ ప్రధాన పూజారి దివి శ్రీకాంత్ బట్టర్, సహాయ పూజారి రుషి, సాయి, యాదాల సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ప్రారంభానికి గ్రహణం


రైతు భరోసా కేంద్రం చుట్టూ ఉన్న చిల్లకంప

● ఎప్పుడు ప్రారంభిస్తారా.. అని ఎదురు చూస్తున్న రైతులు
● రైతులకు అందని రైతు భరోసా సొమ్ము

పెద్దారవీడు: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు అందించేందుకు, రైతన్నకు ప్రతి అడుగులో అండగా నిలబడాలనే మహోన్నత ఆశయంతో ఆర్బీకేలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ రైతుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) నిర్వీర్యమవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పూరైనా రైతు సేవా కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని భవనాలు

మండలంలో మొత్తం 14 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్టు కింద కలనూతల, సుంకేసులలో అద్దె భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 12 ఆర్బీకేల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరు ఆర్బీకేలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. చట్లమిట్ల, గొబ్బూరు, తంగిరాలపల్లి, కంభంపాడు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ప్రారంభానికి నోచుకున్నాయి. దేవరాజుగట్టు సచివాలయంలో నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. తోకపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం భవనం అసంపూర్తిగా నిలిచింది. అగిన కొన్ని పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం 6 సచివాలయాల్లో ఆర్బీకేలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండలంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. కూటమి పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు సేవలు అందడం లేదు. వినియోగంలోకి రాగానే భవనాలు చుట్టూ చిల్లకంపతో అపరిశుభ్రంగా ఉన్నాయి. నేటికీ ప్రారంభానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అద్దె భవనాల్లో విత్తనాలు, ఎరువులు నిల్వ చేయాలన్నా రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నా భవనాలు ఇరుకుగా ఉండటంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వ్యవసాయాధికారులు తెలిపారు.

పేరు మార్పు తప్ప సాయం లేదు

గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం నుంచి దశల వారీగా డీబీటీ విధానం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా సొమ్మును అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూరైనా నేటికీ ప్రభుత్వం రైతులకు భరోసా అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి రైతు సేవా కేంద్రాలుగా పిలుస్తున్నారు. సాగు చేసిన పంటల పెట్టుబడికి సాయం చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం చేయక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ప్రభుత్వం నుంచి రైతు సేవా కేంద్రాలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు రాలేదు. తోకపల్లిలో భవన నిర్మాణం సంపూర్తిగా నిలిచింది. దేవరాజుగట్టులో ఇంత వరకు భవన నిర్మాణం పనులు ప్రారంభించ లేదు. ఈ విషయాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. నాలుగు రైతు సేవా కేంద్రాల నిర్మాణం పూరైనా వాటికి ఇంజినీరింగ్ అధికారులు కరెంట్ ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే స్వాధీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కె. బుజ్జిబాయి, ఏఓ, పెద్దారవీడు

ఘనంగా గంగాభవానికి పూజలు


ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని గంగవరం పంచాయతీ సోమవర్పాడు గ్రామం పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రంలో వేంచేసిన గంగాభవానికి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు కామేశ్వర శర్మ, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలోని మల్లికార్జున స్వామి, నాగమ్మ తల్లి విగ్రహాలను పూజించారు. ఆలయ చైర్మన్ కె. గురుబ్రహ్మం, ఈవో గుంతపల్లి వాసు పర్యవేక్షించారు.

పండుగనాడూ పచ్చడి మెతుకులే!


సరుకులు కొనుగోలు చేస్తున్న సామాన్యులు

● రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు నిల్
● ద్వితీయశ్రేణి నాయకుల కోసమే రేషన్‌షాపులు..

కురిచేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నాం..పేదోడికి కడుపు నింపుతున్నాం అనే మాటలు ప్రచార ఆర్భాటాలకే పరిమితం అవుతున్నాయి. పండుగ నాడు కూడా పప్పన్నం పెట్టే దుస్థితి లేదు. నిత్యావసరాలు పంపిణీ చేస్తామని నాడు గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం నేడు చతికిలపడింది. కానీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం నల్లబజారుకు వెళ్లే పరిస్థితి ఉండేది కాదు. డీలర్లు ప్రతి పండుగకు పదిరోజులు ముందుగా గ్రామాల్లో చాటింపు వేయించి సరుకులు పంపిణీ చేసేవారు. నేడు ఆ రోజులు పోయాయి. పాత సీసాలో కొత్తసారా అన్నచందంగా నాయకుల మారకపోయినా వారి విధానానికి కొత్త ట్రెండ్ వచ్చింది. రేషన్ బియ్యం పేదోడి ఇంటికి బదులు రైస్ మిల్లులకు అక్రమదారి పట్టాయి. దీనిని ఒక నల్ల వ్యాపారంగా రాజకీయపార్టీలు మార్చుకున్నాయి. అందుకు అధికారులు మార్గదర్శకులయ్యారు. పేదోడి పేరుతో ప్రభుత్వ ధనాన్ని నాయకులు, అధికారులు పీక్కుతింటున్నారు. మండలంలో 26 రేషన్ షాపుల పరిధిలో 11797 తెల్లరేషన్ కార్డులున్నాయి. కానీ బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తున్నారు. సంక్రాంతి పండుగ అంటే ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకునే మూడు రోజుల పండుగ. ఈ పండుగకు 54.5% కందిపప్పు అంటే 6452 కిలోల కందిపప్పు సరఫరా చేశారు. కానీ సగం మంది కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేసి సగం మందికి లేవని చెప్పలేక కొందరు డీలర్లు పూర్తిగా నల్లబజారుకు తరలించారు. ఈ మూడు సరుకులు మినహా ఏ సరుకులు రేషన్ షాపు ద్వారా సరఫరా చేయలేదు. దీంతో పేదలు బయట మార్కెట్లో నిత్యావసరాలు కొనలేక, రేషన్‌షాపులో సరఫరాలేక పచ్చడి మెతుకులు కూడా కష్టంగా పండుగ జరుపుకునే దుస్థితి నెలకొంది. రాష్ట్ర చరిత్రలో ఏనాడూ లేని విధంగా ఈ ఏడాది మూడు పండుగలకు పేదల పరిస్థితి ఇలా మారింది. కోట్లాది రూపాయలు మంజూరు చేసి గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయించటం పై వున్న శ్రద్ధ, పంతాలకు పోయి వేలకోట్ల రూపాయల ప్రభుత్వ భవనాలను నిరుపయోగం చేయటంలో ఉన్న తాపత్రయంలో పేదల పట్ల కొంతమేరైనా చూపకపోవటం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికై నా ప్రభుత్వ పాలకులు, అధికారులు పేదల ఆకలిపట్ల శ్రద్ధ చూపి రేషన్‌షాపుల ద్వారా నిత్యావసరాలు సరఫరా చేయాలని, పండుగ సరుకులు సబ్సిడీపై అందజేసి పేదలు పండుగ వేళ ఆనందంగా ఉండేలా చేయాలని పేదలు కోరుతున్నారు.


రేషన్ దుకాణంలో తూకం వేస్తున్న దృశ్యం

మండల ఆర్యవైశ్య కార్యవర్గం ఏకగ్రీవం

దొనకొండ: మండల ఆర్య వైశ్య సంఘం ఆదివారం స్థానిక పట్టాభి రాముల వారి దేవాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా మునగ నాగరాజు, కాళ్ళ వెంకటేశ్వర్లు, కొత్తమాసు సాయి పాల్గొన్నారు. గౌరవ అధ్యక్షునిగా బైసాని వెంకట సుబ్రమణ్య శేఖర్‌బాబు, మండల ఆర్య వైశ్య అధ్యక్షునిగా కాళ్ళ హనుమంతరావు, ఉపాధ్యక్షులు టంగుటూరి బసవరావు, ప్రధాన కార్యదర్శిగా అచ్యుత శివశంకర్, కోశాధికారిగా రాజశేఖర్.. కొంతమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ మండలంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కానీ, కుటుంబ సభ్యులు కానీ ఎటువంటి సమస్యలున్నా తమ వంతు సహాయం చేస్తూ వారి సమస్యలు తొలగించేందుకు కృషి చేస్తానని తెలిపారు.


17 ఏళ్ల తరువాత ఒకే చోట..


ఆటల పోటీల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

● ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దర్శి: పట్టణంలోని ఖాశీం మెమోరియల్ గరల్స్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. 2006–07లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒక చోట చేరి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి వారి పేర్లు తో ఆప్యాయంగా పలకరించుకుని ఎలా ఉన్నావు..? ఎన్నాళ్లైంది నిన్ను చూసి అంటూ ఒకరి నొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అప్పట్లో తాము చదువుకున్న పాఠశాల దగ్గరకు చేరి యోగక్షేమాలు, మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అందరూ ఒక చోట కలుసుకోవాలని వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఒకరినొకరు కలుసుకున్నారు. తమ పిల్లలను కూడా తీసుకుని వచ్చి పరిచయాలు చేసుకున్నారు. ఉద్యోగాలు చేసే వారు, ఇంట్లో హౌస్ వైఫ్‌గా ఉంటూ పిల్లల ఆలనా పాలనా చూసుకునేవారు. తమ భర్తలు చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాలు గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల వ్యవస్థాపకులు తమ గురువు మస్తాన్ మాస్టారును అందరూ కలిసి దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులందరినీ పిలిచి సన్మానించారు. ఆటల పోటీలు నిర్వహించి ఆనందంగా గడిపారు. కార్యక్రమం ఉపాధ్యాయులు శ్రీను, మొహరున్నీసా, మిల్టన్ ఖాసిం, ఖాజావలి, వెంకటేశ్వర్లు, సుధాకర్, సుభాని, గురవయ్య, చిరంజీవి, సుధారాణి, సుజాత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నీరాటోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీ పోలేరమ్మ అమ్మవారు, గోదాదేవీ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని గోదాదేవీగా అలంకరించి మహిళా భక్తులు నీరాటోత్సవం నిర్వహించారు. అమ్మవారికి 28వ రోజు పాశురాన్ని నివేదించారు. ఆలయ అర్చకులు పంచామృతాలతో స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధరకాల పూలతో అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు టీపీ వెంకటేశ్వర్లు, నిట్టూరి వెంకట రమేష్, సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

శ్రీ అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వేంచేసియున్న శ్రీ అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కరిన కోర్కెలు తీర్చి అందరినీ చల్లగా చూడాలని మార్కాపురం పట్టణ శివారులో ఉన్నటువంటి శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు ఆదివారం నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో ఆలయ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ


గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పెద్దదోర్నాల: స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చెంచు గిరిజనులకు దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బయ్యన్న గూడెంలోని 45 చెంచు గిరిజనులకు పంపిణీ చేశారు. ఫేస్ బుక్ మిత్రులు మున్నూరు శ్రీనివాస్, కాసుల పాండు తదితరుల ద్వారా వచ్చిన విరాళాలతో 25 వేల రూపాయలతో 12 రకాల నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసరావు తెలిపారు. బీజేపీ మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షురాలు షేక్ షబానా, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మహిళా సెల్ జిల్లా చైర్మన్ గీతా భవానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, నాయకులు

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ అవుతాయని, ఇప్పటి వరకు 62 టీంల పేర్లు నమోదు చేశామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ మేరకు టోర్నమెంట్ జరిగే స్థానిక మాచర్ల రోడ్డులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆట స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రతి టీంకు యూనిఫాం అందజేస్తున్నామని, విజేతకు రూ. 50 వేలు, రన్నరప్‌కు రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, రన్నరప్, బెస్ట్ బ్యాటర్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌లకు రూ 5 వేల ప్రకారం బహుమతులు ఉంటాయని, రాజకీయలకు అతీతంగా జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

పొదిలి: అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నా మాటు వేసి పట్టించే విధంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం మాట్లాడుతూ పేకాట, కోడి పందేలు, బైక్ రేసులు, ఇతర జూదాలు ఎక్కడ జరుగుతున్నా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

షటిల్ విజేతలకు బహుమతుల పంపిణీ

పొదిలి: స్థానిక విశ్వశాంతి పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పొదిలి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆదివారం బహుమతుల పంపిణీ జరిగింది. క్రీడా ప్రాంగణం అవసరం పొదిలికి ఎంతో ఉందని ప్రభుత్వ దృష్టికి ఈవిషయం తీసుకవెళ్ళి సాధించుకోవాలని పలువురు కోరారు. టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్(పండు), ఎస్ఆర్ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి బహుమతులు సమకూర్చారు. జిల్లా స్థాయి మెన్స్ విభాగంలో రహమాన్, రమేష్, శ్రీనాథ్, హర్ష, రాహుల్, తేజ, ఎం.నాగేశ్వరరావు, అజీజ టీంలు గెలుపొందాయి. 50 ప్లస్ విభాగంలో ఎం.నాగేశ్వరరావు, అజీజ్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, రామకృష్ణారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ఎల్.శ్రీనివాసరెడ్డి, షేక్ వలి టీంలు గెలుపొందాయి. పొదిలి స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను రాము, వెంకట్, బాలు, శ్రీనివాసరెడ్డి, సుబ్రమణ్యం, హిమతేజ టీంలు గెలుపొందారు. విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గునుపూడి భాస్కర్ బహుమతులను పంపిణీ చేశారు.


విజేతలతో సీఐ వెంకటేశ్వర్లు, శ్రావణి, భాస్కర్